

# ధారలుగా కారిన రక్తం వరదలుగా కారిన కన్నీళ్ళు

## – కొమ్మూరి సాంబశివరావు



*(గత సంచిక తరువాయి)*

"**అవసరంలేదు.** నాకు స్పృహ వున్నంత మాత్రాన మీకు ఎటువంటి ఆటంకమూ వుండదు" అన్నది కాత్యా, తన దగ్గరకి యింజక్షన్ సిరంజ్ తీసుకుని మనిషి రాగానే.

జ్ఞాపకం చేసుకుంటోంది, తను వాళ్ళకి ఎలా చిక్కిందీ. పొరపాటూ తనదే. సామాన్యంగా బజర్ చప్పుడు అయితే, తలుపుకి వున్న గాజు ముక్కలోంచి ఎవరు వచ్చారో చూసి, తర్వాత కాని తలుపు తియ్యదు. తియ్యవద్దని యుగంధర్ ఆజ్ఞ. పెద్ద కేసు ఏదీ దర్యాప్తు చెయ్యడంలేదు కనుక, కాస్త అజాగ్రత్త. అలా తలుపు అద్దంలోంచి చూడకుండా తలుపు తీసింది. అంతే. ఇద్దరు, ఒక స్త్రీ , ఒక పురుషుడు లోపలికి రావడం, వచ్చీ రావడంతో మొహమ్మీద పొడి జల్లడం. అంతే, ఆ తర్వాత మళ్ళీ తనకి స్పృహ వచ్చేటప్పటికి, యింకోచోట యింకో గదిలో వుంది. ఇద్దరు మొగాళ్ళు, ఒక స్త్రీ వున్నారు. జయశ్రీనీ, సుమిత్రనీ, రాధనీ హత్య చేసిన విషయం చెప్పి, ఫోటోలు చూపించారు.

"నీకూ చావాలని వుందా? లేకపోతే యుగంధర్‌కి ఫోన్ చెయ్యి" అన్నారు. వాళ్ళ మొహాలు చూస్తేనే తెలిసిపోయింది. తనని చంపడానికి క్షణం కూడా తటపటాయించరని. వాళ్ళు చెప్పినట్లు యుగంధర్‌కి ఫోన్ చేసింది.

"నువ్వు మాకు ఆటంకం అనికాదు. ఇది తీసుకుంటే కాస్త హాయిగా వుంటుంది. మబ్బుల్లో తేలిపోతావు. నీతీ, అవినీతీ, ధర్మమూ, న్యాయమూలాంటి వాటి గురించి మర్చిపోతావు."

"నాకు నీతీ, ధర్మమూ, న్యాయమూ ఉన్నాయని మీకు ఎవరు చెప్పారు?" అడిగింది కాత్యా కొంటెగా నవ్వుతూ.

"పూర్వం వుండేవి కావు. ఈ యుగంధర్‌తో చేరిన తర్వాత లేని విలువలు కల్పించుకున్నావు" అని నవ్వింది.

"నిన్ను చంపను. చంపవలసిన అవసరమూ లేదు. నీవల్ల మాకు చాలా లాభం. ఎంత వస్తుందంటావు?" అడిగాడు పక్కన వున్న అతనిని.

"కనీసం రెండు లక్షలు"

“నొ..నొ..నో చాలా తక్కువ. అధమం మూడు లక్షలు కావాలి. కాత్యా పద అవతలి గదిలోకి వెళ్దాం" అన్నాడు ఒకడు.

"ఎందుకు?" అడిగింది.

"నిన్నేమీ చెయ్యము. రెండు ఫోటోలు తీస్తాం అంతే. అభ్యంతరమా?" అడిగాడు.

"ఫోటోలు దేనికి?"

"చెపితే మా వ్యాపారం గురించి చెప్పినవాళ్ళం అవుతాం. పద" అవతల గది చిన్నది. ఫోటోలు తీసేందుకు దీపాలు వున్నాయి. ఒక కెమెరా స్టాండ్ మీద వున్నది.

"మొదట బట్టల్తో ఒక ఫోటో. తర్వాత బట్టలు తీసేసి ఒక ఫోటో. మంచి ఫోజులు రెండు యివ్వాలి" అన్నాడు.

కాత్యా భుజాలు చరిచింది.

ఎవరూ మాట్లాడడంలేదు. యుగంధర్ ఏ నిర్ణయానికి వస్తాడా అని మిగతా ముగ్గురూ ఆలోచిస్తున్నారు. అడగడానికి ఎవరికీ ధైర్యం లేదు. గడియారం ముళ్ళు కదులుతున్నాయి.

గంట అయింది. టెలిఫోన్ మోగింది.

"యుగంధర్ స్పీకింగ్"

"మీ నిర్ణయం? కేసు దర్యాప్తు మానేస్తానని మాతో చెప్పి, మీలా ఎవరికో వేషం వేసి, మీ ఇంట్లో కూర్చోపెట్టి మారువేషంలో మీరు దర్యాప్తు చెయ్యడానికి పూనుకోకండి. అలా మీరు పూర్వం ఒకసారి చేశారు. ఆ విషయం అందరికీ తెలుసు. రెండోసారి అటువంటి ఆట సాగదు" అన్నాడు అవతలనించి.

"అటువంటి ఆలోచన నాకు రాలేదు."

"అయితే చెప్పండి."

"నేను దర్యాప్తు మానను" అన్నాడు యుగంధర్.

"కాత్యా"

"మీ యిష్టం. అపరాధ పరిశోధన వృత్తిగా తీసుకున్న తర్వాత, ప్రాణానికి ఆపద అనుక్షణమూ వుంటుంది. కాత్యాకేకాదు. నాకూ, రాజుకి కూడా. కాత్యా ప్రాణాన్ని కాపాడడం కోసం నేను దర్యాప్తు మానను" అన్నాడు యుగంధర్.

"అయితే"

"బెదిరించి ప్రయోజనంలేదు" అన్నాడు యుగంధర్. క్లిక్‌మనంది టెలిఫోన్.

"వాట్ యుగంధర్? కాత్యా" అడిగాడు యిన్‌స్పెక్టర్.

"తప్పదు డియర్ స్వరాజ్యరావు. ఇలా బెదిరింపులకు లొంగి, నేను దర్యాప్తు మానేస్తే ఇక యీ వృత్తిలోంచి వెళ్ళిపోవచ్చు.దయచేసి కాత్యా విషయం మర్చిపొండి" అన్నాడు యుగంధర్.

"మీది యింత కఠినమైన హృదయం అనుకోలేదు. రేపు నేనూ యిలాటి ఆపదలో వున్నా మీరు" అంటున్నాడు రాజు.

"అవును రాజూ నీ ప్రాణాన్ని కాపాడడనికి అయినా నేను నా వృత్తి ధర్మం మానుకోను. అంతేకాదు నా ప్రాణాన్ని కాపాడడానికి నువ్వూ అలా మానుకోకు. హృదయం లేనివాడిని నేను అంటున్నావు. హృదయం వుండబట్టే యిలా చేస్తున్నాను. మనం దర్యాప్తు మానుకుంటే యింకా ఎంతమందో యువతుల ప్రాణాలు పోతాయి అని నా అనుమానం" అన్నాడు యుగంధర్.

రాజు మొహం ఎర్రనయింది. "మీరు లక్ష చెప్పినా మీ దృక్పథం నాకు నచ్చలేదు. ఇన్నేళ్ళుగా విశ్వాసంతో మీమీద అపారమైన గౌరవం, ఆపేక్ష పెట్టుకుని, మీరు గీచిన గీటు దాటకుండా మీకు తోడుగా, నీడగా వున్న కాత్యాని యిలా బలి యిస్తున్నారంటే, నాకు పరిచయమున్న యుగంధర్ యీ పని చేస్తున్నారా అని అనుమానంగా ఉంది" అన్నాడు రాజు.

"సారీ రాజు" అన్నాడు యుగంధర్.

"మిమ్మల్ని నమ్ముకున్న కాత్యానీ, నన్నూ కాపాడలేని, కాపడను అనే మీ తత్వం నాకు అర్థంకావడంలేదు. మా ప్రాణాలకన్నా శరీరాలు అమ్ముకుని నీచంగా బతికే యువతుల ప్రాణాలు ఎక్కువ విలువ వున్నవి అయితే అందులోనూ వాళ్ళు ఎవరూ మీ క్లయింట్సు కానపుడు" అన్నాడు రాజు.

యుగంధర్ మౌనంగా వుండిపోయాడు.

"యుగంధర్‌గారూ క్షమించండి. ఉదాత్తత, నిస్వార్థమైన వృత్తిగత ధర్మమూ మీకు వుండవచ్చు. నేను సామాన్యుణ్ణి. కాత్యాని యింత సులభంగా బలి యివ్వడానికి మీరు సిద్దపడ్డారంటే మీమీద గౌరవం పోయింది నాకు. దయచేసి నా రాజీనామా తీసుకోండి. మీకు అసిస్టెంటుగా పనిచెయ్యడంలో నాకు గౌరవం ఏ మాత్రం లేదనిపిస్తోంది" అన్నాడు రాజు.

"సరే రాజూ నీకు కావలసిన వస్తువులని తీసుకుని వెళ్ళు. నువ్వు స్వంతంగా వేరే డిటెక్టివ్" అంటున్నాడు యుగంధర్.

"నా బట్టలు, నా రివాల్వర్ తప్ప యింకేమీ తీసుకుని వెళ్ళను. నేను ఏం చేస్తానో మీకు అనవసరం గుడ్‌బై" అన్నాడు రాజు.

"మిస్టర్ యుగంధర్" అన్నాడు యిన్‌స్పెక్టర్ స్వరాజ్యరావు.

"అవును. రాజు అన్నమాటలు సరి అయినవే. నాకు అసిస్టెంట్సుగా వున్నవారి ప్రాణాలని కాపాడలేని నా వద్ద ఎందుకు పనిచెయ్యాలి?"

"అయితే"

"దర్యాప్తు మానను ఇన్‌స్పెక్టర్. శరీరాలు అమ్ముకుని బతికే స్త్రీలు అని వాళ్ళని చాలాచులకనగా, చీడపురుగుల్లా మాట్లాడాడు రాజు. విలాసం కోసం, డబ్బు విరివిగా సంపాదించాలనే అత్యాశతో, శరీరాలు అమ్ముకునే స్త్రీలు వున్నా, కడుపులో ఆకలి నింపుకోవడం కోసం, ఒక్కొక్కప్పుడు కన్న పిల్లలకి పాలులేక, పాలు కొనడానికి డబ్బు కోసం శరీరాలు అమ్ముకుని బతకవలసిన దుస్థితికి ఆ స్త్రీలు వచ్చారంటే,దానికి కారకులు ఎవరు? ఆ శరీరాలు కోరే మొగాళ్ళా? ప్రతి మనిషికీ, కడుపునిండా తిండీ, బట్టలు యివ్వలేని మన ఆర్థిక వ్యవస్థా? ప్లీజ్. ఇక యీ విషయం చర్చించవద్దు. ఏదీ మీరు తెచ్చిన కాగితం?" అన్నాడు యుగంధర్.

9

"నగరవాసులకీ, రాష్ట్ర ప్రజలకీ, ప్రఖ్యాత డిటెక్టివ్ యుగంధర్ ఒక విజ్ఞప్తి. కాదు. ఒక హెచ్చరిక యిస్తున్నారు. శ్రద్ధగా వినమని కోరుతున్నాము శ్రోతలని" అనౌన్సర్ చెప్పిన తర్వాత యుగంధర్ ప్రారంభించాడు.

"నా పేరు యుగంధర్. నేను ప్రయివేటు డిటెక్టివ్‌ని. నిన్నటి రోజున నగరంలో జయశ్రీ, సుమిత్రలనే యిద్దరు యువతులని రాక్షసంగా హత్య చేశారని పౌరులకి తెలిసే ఉంటుంది. రాధ అనే మరో యువతి కూడా అదే విధంగా హత్యచెయ్యబడింది. ఈ ముగ్గురు యువతుల్ని ఒకేరకంగా హత్య చెయ్యడం వల్ల హంతకులు ఒకే ముఠాకి చెందినవారని నా అనుమానం. అంతేకాదు, వయస్సులో వున్న, సినిమాలలో చిన్న చిన్న వేషాలు వేసే, అంతేకాక, జీవనోపాధికోసం శరీరాలు అమ్ముకునే, వయస్సులో వున్న యువతులు అందరూ ప్రస్తుతం ప్రమాదంలో వున్నారని నా భయం. కనుక, ఈ హత్యల గురించి సూచనగా తెలిసిన యువతులు, ఏమీ తెలియని యువతులు, ముఖ్యంగా నేను ఉదహరించిన తరగతికి చెందిన యువతులు, తక్షణం దగ్గర వున్న పోలీస్ స్టేషన్‌కి వెళ్ళి, తమ పేరు, చిరునామా చెపితే పోలీసువారు వారికి ఏ ఆపదా రాకుండా తగిన రక్షణ యిస్తారు. పోలీసువారు తమ మీద కేసులు పెడతారని భయపడవద్దు. తమకై తాము వచ్చి, రక్షణ కోరిన ఏ యువతిపై కూడా కేసు పెట్టవద్దని ప్రభుత్వం ఆర్డర్ యిచ్చింది. దయచేసి నా యీ హెచ్చరిక అలక్ష్యం చెయ్యవద్దని ప్రార్థిస్తున్నాను."

యుగంధర్ ప్రసంగం ముగించాడు. తర్వాత టి.విలో అదేవిధంగా ఉపన్యసించాడు. ఆనాటి దినపత్రికల్లో అదేవిధంగా యుగంధర్ పేరున ప్రకటనలు అచ్చువేశారు.

10

క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ అనేది ఒకటివుంది. పోలీసులు దర్యాప్తు ఆ నిబంధనల ప్రకారం సాగించాలి. తనకి ఇటువంటి నిబంధనలు లేవు. జయశ్రీ, సుమిత్రల హత్యలకీ, కాత్యాని ఎత్తుకుని పోవడానికీ సంబంధం వుంది. పుండరీకాక్షయ్య నిర్దోషి కావచ్చు. సుమిత్రనీ, జయశ్రీనీ హత్యచేసి వుండకపోవచ్చు. కాని, వారు ఎందుకు హత్య చెయ్యబడిందీ అతనికి తెలుసు. తెలుసుండాలి అని రాజు నిశ్చయించుకున్నాడు. కాత్యాని ఆ రాక్షసుల నించి కాపాడాలంటే ఒకటే మార్గం. వాళ్ళు ఎవరో తెలుసుకోవాలి. వ్యవధిలేదు. రేపటికల్లా కాత్యా శవాన్ని గాంధీ పార్కులో పడేస్తామన్నారు. ఈలోగా ఆలోచిస్తూ రాజు పుండరీకాక్షయ్య యింటికి వెళ్ళాడు. రివాజుగా ఒక పోలీస్ కానిస్టేబుల్ బయట కాపలా వున్నాడు .రాజుని గుర్తుపట్టి సెల్యూట్ చేశాడు. తలుపు తట్టగానే తీశాడు పుండరీకాక్షయ్య.

రాజుని గుర్తుపట్టలేదు.

"ఎవరు?" అడిగాడు.

"తర్వాత చెపుతాను. ముందు మనం విడిగా ఒక గదిలోకి వెళ్ళాలి. రహస్యం" అన్నాడు. వెంటనే పుండరీకాక్షయ్య మొహం పాలిపోయింది. బెదురుతూ 'రండి' అన్నాడు.

హాలుకి వెనక వున్న గదిలోకి తీసుకుని వెళ్ళాడు. "కిటికీలు, తలుపులూ ముయ్యి" అన్నాడు రాజు.

పుండరీకాక్షయ్య ఎదురు చెప్పకుండా అన్ని కిటికీలూ, తలుపులూ మూశాడు. రాజువైపు తిరిగి, "తమరు?" అడిగాడు.

అంతే, రాజు పిడికిలి బిగించి పుండరీకాక్షయ్యను బలంగా నోటిమీద కొట్టాడు. పళ్ళే వూడాయో, పెదిమలే చిట్లాయో, రక్తం కారుతోంది.

"నేనేం" అంటున్నాడు పుండరీకాక్షయ్య.

రాజు మళ్ళీ రెండు పిడికిళ్ళూ బిగించి, పుండరీకాక్షయ్య చెవులని బాదాడు. ఆ దెబ్బలకి తట్టుకోలేక పుండరీకాక్షయ్య నేలమీదికి ఒరిగిపోతున్నాడు. ఒరిగిపోతున్న వాణ్ణి మోకాలితో డొక్కలో తన్ని, ఒక చేత్తో పైకిలాగి నిలబెట్టి, రెండో చేత్తో మళ్ళీ దవడ మీదమీద బలంగా కొట్టాడు.

పుండరీకాక్షయ్య ఏడుస్తూ, "ఎందుకు?" అన్నాడు.

రాజు అతన్ని పొట్టమీద బూట్ కాలితో తన్నాడు. పుండరీకాక్షయ్య నేలమీద పడిపోయాడు. రాజు జేబులోంచి కత్తితీసి, అరచేతిమీద పదును పెడుతూ, "నేను అడిగే ప్రశ్నలకి నిజం చెపుతావా? లేక నువ్వూ"

పుండరీకాక్షయ్య రాజు కళ్ళల్లోకి చూడాడు. కళ్ళల్లో దయ, దాక్షిణ్యమూ లేవు. కసీ, ద్వేషమూ మందుతున్నాయి.

పుండరీకాక్షయ్యకి ముచ్చెమటలు పోశాయి. తలవూపాడు.

"అబద్ధాలు చెప్పావో అరక్షణం బతకవు. నేను మర్యాదగా ప్రశ్నించేందుకు పోలీసు ఆఫీసర్ని కాను."

పుండరీకాక్షయ్య గజగజ వొణుకుతున్నాడు. "చెపుతాను" అన్నాడు.

"రెస్పాన్స్ వెరీ పూర్" అన్నాడు ఐ.జి.

"అంటే?" అడిగాడు యుగంధర్.

"ఒక్కొక్క పోలీస్ స్టేషన్‌కీ, ఒకరో యిద్దరో తప్ప రక్షణ కోరినవారు లేరు. ఆ ఒకరిద్దరిలోనూ భయపడ్డ, మధ్య తరగతి సంసార స్త్రీలు ఎక్కువ" అన్నాడు ఇన్‌స్పెక్టర్ స్వరాజ్యరావు.

"సారీ యుగంధర్ మీ అంచనా తప్పు అని అనిపిస్తోంది. జయశ్రీ, సుమిత్ర, రాధ హత్యలు సామాన్యమైన ప్రేమ, అసూయకి చెందిన హత్యలు అనుకుంటాను" అన్నాడు ఐ.జి.

"అయితే నన్నూ, రాజునీ ఎత్తుకుపోవడానికి ఎందుకు ప్రయత్నం చేశారు? కాత్యాని యెందుకు యెత్తుకుపోయారు? ఈ కేసునుంచి నన్ను విరమించుకోమని ఎందుకు బెదిరించారు? యెదురు ప్రశ్న వేశాడు యుగంధర్.

"మీరు అనేకమైన కేసులు దర్యాప్తు చేశారు. ఆ కేసులు.."

యుగంధర్ నవ్వి, చాలా హాస్యాస్పదంగా వుంది. నేను దర్యాప్తు చేసిన కేసులకీ, యీ కేసుకీ సమబంధంలేదు. అన్నట్టు రాజు ఏమయ్యాడు? ఊరుకోడే" అన్నాడు యుగంధర్.

"రాజు పుండరీకాక్షయ్య యింటికి వెళ్ళి, అక్కడ ఒకగంట వుండి తర్వాత వెళ్ళిపోయాడట. మా కానిస్టేబుల్ చెప్పాడు" అన్నాడు స్వరాజ్యరావు.

"అక్కణ్ణించి యెక్కడికి వెళ్ళాడో?" అన్నాడు యుగంధర్.

"రాజుని ఓ కంట కనిపెట్టి వుండమని మీరు చెప్పలేదు. చెబితే"

యుగంధర్ నవ్వి "మీరు, మీ కానిస్టేబుల్స్ వెయ్యిమంది కనిపెడుతున్నా మీకు కనిపించకుండా అదృశ్యం కాగలడు. రాజు పుండరీకాక్షయ్య దగ్గర గంట వుండి ఏం చేశాడో తెలుసుకుందాం పదండి" అన్నాడు యుగంధర్.

ముగ్గురూ లేచారు. రింగ్ మంది టెలిఫోన్.

స్వరాజ్యరావే రిసీవర్ తీశాడు. "డి.టూ. స్టేషన్ నించి. అయిదు నిమిషాల క్రితం ఒక యువతి పోలీస్ స్టేషన్‌లోకి వస్తుండగా, అంటే పోలీస్ స్టేషన్ మెట్లు ఎక్కుతుండగా షూట్ చేసి చంపారు."

"డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ స్వరాజ్యరావు హియర్. నేను వస్తున్నాను. నేను వచ్చేటంతవరకూ ఏదీ కదలచకండి" అని రిసీవర్ పెట్టేసి, విషయం ఐ.జికి చెప్పాడు. ముగ్గురూ, ఐ.జి పోలీస్ వాన్‌లో వెంటనే డి.టు పోలీస్ స్టేషన్‌కి వెళ్ళారు.

అతను కాత్యా దగ్గరగా జరిగి భుజం మీద చెయ్యివేశాడు.

కాత్యా దూరంగా జరగలేదు. "యుగంధర్ కేసు నుంచి విరమించుకోకపోతే రేపటికి నన్ను..." అంటోంది.

"డియర్! అంత ఫూలిష్ పని ఎందుకు చేస్తాము? యుగంధర్ బెదురుతాడేమోనని ప్రయత్నించాము, అంతే. నీవల్ల మాకు చాలా లాభాలున్నాయి. నీ ప్రాణాన్ని మా ప్రాణాలతో సమానంగా కాపాడుతాము" అన్నాడు.

"ఎందుకో?" అన్నది కాత్యా సరసంగా.

"అది రహస్యం."

"నేను ఎలాగూ మీనించి తప్పించుకుని పోలేను. నాకు చెపితే మాత్రం ఏమిటి నష్టం?"

"అవును. నష్టంలేదు. అయినా యెందుకు చెప్పాలి?"

కాత్యా అతన్ని ఒక చిన్న ముద్దు పెట్టుకుని, "యిందుకు" అన్నది

"అమ్మబాబో బాస్‌కి తెలిస్తే"

"చెప్పనుగా" అంటూ కావలించుకుని, "చెప్పవూ చెవిలో చెప్పు. ఎవరికీ వినిపించదు. నాదీ, నీదీ ఆ రహస్యం. ఆ తర్వాత నేను నీకు ఎన్నో రహస్యాలు చూపిస్తాను."

అతను కాత్యా చెవిలో చెపుతున్నాడు.

"ఈమె ఎవరో తెలుసా?" అడిగాడు ఐ.జి. డి.టు. స్టేషన్ ఇన్‌స్పెక్టర్ని.

"తెలుసు సార్. ఈమె పేరు రోజీ. రెండు మూడుసార్లు బుక్ చేశాం, రాత్రిళ్ళు యీ ప్రాంతాల్లో మొగాళ్ళకోసం తారట్లాడుతున్నందుకు" అన్నాడు స్టేషన్ ఆఫీసర్.

"ఈ హత్య ఎలా జరిగింది? ఒక మనిషి పోలీస్ స్టేషన్ ఆవరణలోకి వచ్చిన తర్వాత, మెట్లు ఎక్కుతున్నప్పుడు, ఎవరో షూట్ చేసి చంపారంటే ఎంత అవమానం. స్టేషన్ గేటు దగ్గర కాపలా వుండే కానిస్టేబుల్స్ ఏమయ్యారు?" చాలా కోపంగా అరిచాడు ఐ.జి.

"ఇద్దరు కానిస్టేబుల్స్ గేటుకి చెరొకవైపూ కాపలా వున్నారు."

"డామిట్ అయితే లోపలికి ఎలా వచ్చాడు హంతకుడు?"

"హంతకుడు లోపలికి రాలేదు సార్."

"ఏమిటి మాట్లాడుతున్నావు? మేము ఫూల్స్ అనుకున్నావా?" అరిచాడు ఐ.జి.

యుగంధర్ ఐ.జి భుజం తట్టి, "ముందు శవాన్ని పరీక్ష చేద్దాం. తర్వాత ప్రశ్నలు వేద్దాం" అన్నాడు.

పోలీస్ స్టేషన్ మెట్లమీద నిలువునా, మూడు మెట్ల మీద పడున్నది రోజీ. పాతికేళ్ళుంటాయి. పెదిమలకి రంగు, పౌడర్, మేకప్ లేకపోవడంవల్లనేమో యింకో పది సంవత్సరాలు ఎక్కువ కనిపిస్తోంది.

బోర్లా పడున్నది.

యుగంధర్ మోకాళ్ళమీద వొంగి, శవాన్ని ముట్టుకోకుండానే పరీక్ష చేశాడు.

"పోలీస్ స్టేషన్‌లోకి యెవరూ వచ్చి ఈమెను కాల్చి చంపలేదు. దూరాన్నుంచి టెలిస్కోపిక్ రైఫిల్ వుపయోగించి షూట్ చేశారు" అంటూ శరీరాన్ని కొద్దిగా పక్కకి తిప్పాడు. ఆమె గుప్పెట్లో ఏదో కాగితం వుండడం చూసి, నెమ్మదిగా కీళ్ళు సడలించి, ఆ కాగితాన్ని బయటకి తీశాడు. అది కాగితం కాదు. రెండు ఫోటోలు. ఒకటి జయశ్రీ, సుమిత్రలు హత్యచెయ్యబడ్డ ఫోటో. రెండోది రాధది. రెండిటి వెనక, "నోరు విప్పితే నీకూ యిదే గతి" అని యెర్రని అక్షరాలతో వ్రాసి వుంది.

## ( కొనసాగింపు వచ్చే నెలలో)

Post your comments